epaper.samayamdaily.net
APTEL/26/A3949
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
SAMAYAM
సంపుటి: 1 | సంచిక: 109 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 31 అక్టోబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం!

గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయని మండిపడ్డారు.

- వంటగ్యాస్, ఎరువుల కొరత అంటూ విపక్షాల పుకార్లు
- రైతులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నాం
- 24వ విడత పీఎం కిసాన్ నిధులను విడుదల చేసిన ప్రధాని
- 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,680 కోట్లు జమ

4

ఢిల్లీకి కదలిరండి!

- రేపు రాంలీలా మైదానంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ
- వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న వారిని అడ్డుకుంటున్నారని రాహుల్ ఆరోపణ

4

సీఈసీపై 'జన మహాభియోగ్'

- నేడు ఇండియా కూటమి వినూత్న నిరసన
- మధ్యాహ్నం ఖర్గే నివాసంలో ప్రతిపక్షాల భేటీ
- 13.5 కోట్ల ఓట్ల తొలగింపుపై ప్రధాన చర్చ

4

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు!

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం!

- కాకినాడ అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష
- దీపావళి తర్వాత తీర ప్రాంతాల్లో స్వయంగా పర్యటన
- వేట పడవలకు బీమా కల్పించేలా ప్రతిపాదనలు
- ఉప్పాడ రక్షణ గోడ, బీచ్ రోడ్డు పనులు వేగవంతం
- అర్నబ్ బాధితులకు తక్షణమే సరుకుల పంపిణీ ప్రశంసలు

2



ఏపీకి కేంద్ర బృందాలు!

- తుఫాన్, కరువు నష్టాలపై అంచనా
- నేడు, రేపు గోదావరి జిల్లాల్లో..
- సోమ, మంగళవారాల్లో రాయలసీమలో..
- పర్యటన తర్వాత సీఎంతో భేటీ

అర్నబ్ బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా
పంట నష్టపోయిన రైతులకు అన్నివిధాలా సాయం
నేటికల్లా పూర్తిస్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ
రూ.4,600 కోట్లతో కేంద్రానికి ప్రాథమిక నష్టం నివేదిక
రైతుల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ

అర్నబ్ తుఫాను బీభత్సంతో అతలాకుతలమైన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుసగా రెండో రోజు విస్తృతంగా పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించిన ఆయన.. బాధితులకు కొండంత అండగా నిలిచారు. ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని, కష్టకాలంలో ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుఫాను షెల్టర్లలో తలదాచుకుంటున్న బాధితులకు సీఎం స్వయంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పంటలు, కొబ్బరి చెట్లు నష్టపోయిన రైతులు, వలలు కోల్పోయిన మత్స్యకారులకు పూర్తిస్థాయిలో పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, దశాబ్దాలుగా వేధిస్తున్న ముంపు కష్టాలకు శాశ్వత పరిష్కారంగా ఏకంగా రూ.3 వేల కోట్లతో గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణ చేపడతామని కీలక ప్రకటన చేశారు. మరోవైపు, విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించడమే కాకుండా.. కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టి సిబ్బందిలో ఉత్సాహం నింపారు. శనివారం సాయంత్రానికల్లా పూర్తిస్థాయిలో కరెంట్ సరఫరాను పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

-నరసాపురం, అక్టోబర్ 30 (సమయం న్యూస్) :

వివరాలు 2లో..

రేపే పుర పోరు

- ఉదయం 7 గంటల నుంచి మున్సిపల్ ఎన్నికల పోలింగ్
- కోటి మంది ఓటర్లు, 12 వేల కేంద్రాలు
- 36 వేల మంది పోలీసులతో భద్రత
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

రాష్ట్రంలో మినీ సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. వంద పట్టణ స్థానిక సంస్థలకు శుక్రవారం జరగనున్న ఎన్నికల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. సుమారు కోటి మంది ఓటర్లు తీర్పునివ్వనున్న ఈ పురపోరును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికారులు.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 36 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సున్నిత, సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి డ్రోన్లు, సీసీ కెమెరాలతో డేగకన్ను వేశారు. ఓటర్లు ఎలాంటి భయం, ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది.

3

స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు

ఎస్ఈసీ పునేఠా

3

మనమిత్ర.. జనమిత్ర!

- అర్నబ్ తుఫాన్ వేళ బాధితులకు కొండంత భరోసా
- వాట్సాప్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకున్న ప్రజలు
- 1500కు పైగా ఫిర్యాదులు.. 95 శాతం పరిష్కారం
- గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికం

2

విపత్తు సమయంలో అభాగ్యులకు భరోసానిచ్చేందుకు సాంకేతికత ఎంతలా ఉపయోగపడుతుందో చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ వేదిక ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. 'అర్నబ్' తుఫానుతో అతలాకుతలమైన ప్రాంతాల్లో బాధితులకు ఈ సేవలు కొండంత అండగా మారాయి. కరెంటు లేక, కమ్యూనికేషన్ తెగిపోయి, నీటమునిగిన ఇళ్లలో చిక్కుకున్న ప్రజలు.. ఈ సింగిల్ వాట్సాప్ వేదికగా ప్రభుత్వానికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆహారం, మందులు కావాలన్నా.. కూలిన చెట్లను తొలగించాలన్నా క్షణాల్లో అధికారులకు సమాచారం అందించి ఉపశమనం పొందారు.

జగన్‌కు ఆ అర్హత లేదు!

- విపత్తు వేళ రేయింబవళ్లు కష్టపడే వ్యక్తి సీఎం చంద్రబాబు
- ప్రజలు వరదల్లో మునిగిపోతుంటే ఎంజాయ్ చేసిన చరిత్ర ఆయనది
- సంక్షేమానికి, అభివృద్ధికి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్
- మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి
- పెనుకొండలో రాష్ట్ర మంత్రి సవిత

2

డబ్బుల్లేకనే ఓడిపోయాం

- వైశ్యులంతా వైసీపీకి అండగా నిలవాలి
- నిరుపేద మేయర్ అభ్యర్థికి మద్దతు తెలపాలి
- బెదిరింపులకు భయపడొద్దు, ఫ్యాన్‌కే ఓటు వేయాలి
- గుంటూరు వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి అంబటి ఆసక్తికర వ్యాఖ్యలు

3

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం!

కాకినాడ అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

దీపావళి తర్వాత తీర ప్రాంతాల్లో స్వయంగా పర్యటన

వేట పడవలకు బీమా కల్పించేలా ప్రతిపాదనలు

ఉప్పాడ రక్షణ గోడ, బీచ్ రోడ్డు పనులు వేగవంతం

అర్నబ్ బాధితులకు తక్షణమే సరుకుల పంపిణీ

కాకినాడ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తుఫానులు వచ్చిన ప్రతిసారీ తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, వారికి శాశ్వత రక్షణ కల్పించాలన్నారు. శుక్రవారం ఆయన కాకినాడ జిల్లా యంత్రాంగం, మత్స్యకారులతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. అర్నబ్ తుఫాను నష్టం, సహాయక చర్యలపై ఆరా తీశారు. వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించేలా సాధ్యాసాధ్యాలు పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో స్వయంగా పర్యటించి వారి కష్టాలు తెలుసుకుంటానని పవన్ వెల్లడించారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ డిజైన్ పనులు వేగవంతం చేయడంతో పాటు, దెబ్బతిన్న బీచ్ రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. తుఫాను సమయంలో పది వేల మందికి పైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, ప్రాణనష్టం జరగకుండా అడ్డుకున్న అధికారులను, సహాయక బృందాలను ఆయన అభినందించారు. పిఠాపురం నియోజకవర్గంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను వెంటనే బాగుచేయాలని స్పష్టం చేశారు. ముంపు బాధితులకు 25 కేజీల బియ్యం, మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు

మనమిత్ర.. జనమిత్ర!

అర్నబ్ తుఫాన్ వేళ బాధితులకు కొండంత భరోసా

వాట్సాప్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకున్న ప్రజలు

1500కు పైగా ఫిర్యాదులు.. 95 శాతం పరిష్కారం

గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అత్యధికం

అమరావతి, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : అర్నబ్ తుఫాన్ విపత్తు వేళ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ బాధితులకు కొండంత అండగా నిలిచింది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను దీని ద్వారా నేరుగా ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చి సత్వర సాయం పొందారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్‌ల ఆదేశాల మేరకు.. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అధికారులు ఈ సదుపాయాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువచ్చి విస్తృత ప్రచారం కల్పించారు. దీనిద్వారా తమ ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోవడం, చెట్లు కూలడం, కరెంటు అంతరాయం, ఆహారం, మెడిసిన్స్ కొరత తదితర సమస్యలను ప్రజలు సులభంగా ప్రభుత్వానికి తెలియజేసి ఉపశమనం పొందారు.

యుద్ధప్రాతిపదికన పరిష్కారం..

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజల నుంచి శుక్రవారం సాయంత్రానికి మనమిత్ర ద్వారా 1500కు పైగా ఫిర్యాదులు అందాయి. వీటిలో 95 శాతానికి పైగా సమస్యలను అధికారులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించడం విశేషం. మనమిత్ర ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ స్వయంగా పర్యవేక్షించారు. ఆయా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలకు పంపించి, సంబంధిత అధికారుల ద్వారా తక్షణమే పరిష్కారం అయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే ఎక్కువ..

అర్నబ్ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న గోదావరి జిల్లాల ప్రజలు ఈ వాట్సాప్ గవర్నెన్స్ సేవలను పెద్ద ఎత్తున వినియోగించుకున్నారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచే అత్యధిక ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. అలాగే, ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి కూడా వందల సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను మనమిత్ర ద్వారా పంచుకుని సాయం పొందారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు!

నరసాపురం, అక్టోబర్ 30 (సమయం న్యూస్): అర్నబ్ తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులు, కొబ్బరి రైతులు, మత్స్యకారులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో తన పర్యటనలో భాగంగా రెండో రోజు పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో సీఎం పర్యటించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించడంతో పాటు, రైతులు, మత్స్యకారులు, స్థానికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పంటల బీమాతోనే రైతుకు ధీమా..

నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ముఖ్యమంత్రి, రైతులతో మాట్లాడారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులంతా తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగినప్పుడు పరిహారం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. దీనికి తోడు ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అండగా ఉంటుందని చెప్పారు. పంట కాలువల్లో నీటి ప్రవాహం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణ కోసం రూ.3 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే, రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపితే, పంటలకు మంచి డిమాండ్ ఉంటుందని సూచించారు.

నేటి సాయంత్రానికి విద్యుత్ పునరుద్ధరణ..

తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేల కూలాయని, శనివారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని సీఎం ప్రకటించారు. తొలుత ఇళ్లకు, ఆ తర్వాత వ్యవసాయ అవసరాలకు కరెంట్ ఇస్తామన్నారు. అవసరమైన అదనపు సిబ్బందిని తెలంగాణ నుంచి కూడా రప్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన.. కార్మికులతో కలిసి స్వయంగా ఓ స్తంభాన్ని నిలబెట్టేందుకు సాయం చేసి వారిని అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు నేల కూలాయని, వ్యర్థాలను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూస్తున్నామన్నారు. టెలికాం టవర్లకు విద్యుత్ నిలిచిపోవడంతో సిగ్నల్స్ సమస్య వచ్చిందని, వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

షెల్టర్లలో బాధితులకు పరామర్శ..

మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. నాలుగు రోజులుగా అక్కడ ఉంటున్న బాధితులతో మాట్లాడారు. ముందుగానే ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని సీఎం వారికి తెలిపారు. వశిష్ట గోదావరిలో ఎదురవుతున్న సమస్యలను మత్స్యకారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సముద్ర ముఖద్వారం వద్ద పూడికను తొలగించి చేపల వేట సాఫీగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్టం నివారణకు ముందస్తు చర్యలు తీసుకున్నామని, రాత్రంతా సమీక్షలు చేసి అధికారులను అప్రమత్తం చేశామన్నారు. గతంతో పోలిస్తే ప్రాణ నష్టం భారీగా తగ్గిందని, దురదృష్టవశాత్తూ ఏడుగురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామని తెలిపారు.

నష్టంపై కేంద్ర బృందం పర్యటన..

తుఫాను వల్ల ప్రాథమికంగా రూ.4,600 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా వేసి కేంద్రానికి నివేదిక పంపామని, పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక ఇస్తామని సీఎం తెలిపారు. ఈ నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువులను నింపేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

నిత్యావసరాల పంపిణీ.. సుఖీభవ నిధులు జమ..

బాధిత కుటుంబాలకు బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రేషన్ అందరికీ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నప్పటికీ బాధితుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. అనంతరం బాధితులకు సీఎం స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. అలాగే, పీఎం కిసాన్‌ఉఅన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు సీఎం వెల్లడించారు. ఏడాదికి మూడు విడతల్లో మొత్తం రూ.20 వేలు ఇస్తామన్న హామీలో భాగంగా, రెండో విడతగా రూ.7 వేల చొప్పున రైతులకు జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీకి కేంద్ర బృందాలు!

- తుఫాన్, కరువు నష్టాలపై అంచనా
- నేడు, రేపు గోదావరి జిల్లాల్లో..
- సోమ, మంగళవారాల్లో రాయలసీమలో..
- పర్యటన తర్వాత సీఎంతో భేటీ

అమరావతి, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో 'అర్నబ్' తుఫాను సృష్టించిన బీభత్సం, ఖరీఫ్-2026లో నెలకొన్న కరువు పరిస్థితులను అంచనా వేసేందుకు రెండు కేంద్ర బృందాలు రాష్ట్రానికి రానున్నాయి. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులు, బాధితులతో నేరుగా మాట్లాడి నష్టాన్ని అంచనా వేస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నివేదికల ఆధారంగానే రాష్ట్రానికి కేంద్రం నుంచి పరిహారం అందనుంది. కేంద్ర హోం శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాష్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం శని, ఆదివారాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది. శనివారం టీమ్-1 కోనసీమ జిల్లాలో, టీమ్-2 తూర్పుగోదావరి జిల్లాలో పర్యటిస్తాయి.

ఆదివారం టీమ్-1 కాకినాడ, టీమ్-2 పశ్చిమగోదావరి జిల్లాల్లో నష్టాలను అంచనా వేస్తాయి. సోమవారం సాయంత్రం సీఎం చంద్రబాబుతో ఈ బృందం భేటీ అవుతుంది. ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని మరో పది మంది సభ్యుల బృందం సోమ, మంగళవారాల్లో పర్యటించనుంది. వీరు అనంతపురం, కర్నూలు, నంద్యాల, సత్యసాయి జిల్లాల్లో రైతులను కలిసి పంటల పరిస్థితి, వర్షాభావం తదితర అంశాలను పరిశీలిస్తారు. ఈ బృందం బుధవారం ముఖ్యమంత్రితో సమావేశమై పరిస్థితిని వివరించనుంది.

జగన్‌కు ఆ అర్హత లేదు!

- విపత్తు వేళ రేయింబవళ్లు కష్టపడే వ్యక్తి సీఎం చంద్రబాబు
- పెనుకొండలో రాష్ట్ర మంత్రి సవిత

పెనుకొండ, అక్టోబర్ 30 (సమయం న్యూస్): ప్రకృతి విపత్తుల సమయంలో రేయింబవళ్లు ప్రజల కోసం కష్టించి పనిచేసే సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత వైఎస్ జగన్‌కు లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. ప్రజలు వరదల్లో మునిగిపోతుంటే ఐ మ్యాక్స్ థియేటర్‌లో కూర్చుని సినిమా ఎంజాయ్ చేసిన చరిత్ర జగన్‌దని విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్షేమానికి, అభివృద్ధికి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అయితే, గుండాయిజం, రౌడీయిజానికి జగన్ కేరాఫ్ అడ్రస్ అని దుయ్యబట్టారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోందని మంత్రి సవిత అన్నారు. 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' నిధులతో పాటు, పెన్షన్ల కోసం కూటమి ప్రభుత్వం ఒక్కరోజే రూ.5,825 కోట్లను విడుదల చేసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రెండో విడతగా రైతులకు రూ.7 వేల చొప్పున మొత్తం రూ.3,125.47 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే మొదటి విడత కింద జూన్‌లో రూ.7 వేల చొప్పున ఇచ్చామని, తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని ఆమె స్పష్టం చేశారు.

బాధితుల గురించి పరితపించే నేత..

గతంలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 42 మంది మరణిస్తే, కనీసం పరామర్శించిన పాపాన కూడా జగన్ పోలేదని సవిత మండిపడ్డారు. వరదల్లో మునిగిన పంటలను కూడా ఆయన గాల్లోంచే పరిశీలించారని విమర్శించారు. కానీ, సీఎం చంద్రబాబు విపత్తు సమయంలో బాధితుల గురించి నిరంతరం పరితపిస్తారని తెలిపారు. గతంలో విజయవాడ వరదల సమయంలో రాత్రింబవళ్లు కలెక్టరేట్‌లోనే బస చేసి సహాయక చర్యలను పర్యవేక్షించారని గుర్తుచేశారు. ఇప్పుడు అర్నబ్ తుఫాను రాకముందే అధికారులను అప్రమత్తం చేసి ప్రాణనష్టం జరగకుండా అడ్డుకున్నారని కొనియాడారు. మోకాల్లోతు బురదలో, నీటిలో దిగి రైతన్నకు అండగా నిలిచే చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు జగన్‌కు లేదని మండిపడ్డారు.

డబుల్ ఇంజిన్ కాదు.. ట్రిపుల్ సర్కార్!

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో కొత్తగా ట్రిపుల్ సర్కార్ ఏర్పాటు కాబోతోందని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలోకి వస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని చెప్పారు. అందువల్ల మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ రెండు ఓట్లను కూటమి అభ్యర్థులకే వేసి గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు

ఏపీకి మళ్లీ వర్ష సూచన!

నేడు వాయుగుండంగా మారనున్న అల్పపీడనం

ఏపీ తీరం వైపు పశ్చిమ వాయవ్య దిశగా కదలిక

దక్షిణ కోస్తా, రాయలసీమల్లో మూడు రోజుల పాటు వానలు

వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు విపత్తుల సంస్థ హెచ్చరిక

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : అర్నబ్ తుఫాను ప్రభావం నుంచి రాష్ట్రం ఇంకా పూర్తిగా కోలుకోకముందే.. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వర్ష సూచన పొంచి ఉంది. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వానలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) స్పష్టం చేసింది. అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న నికోబార్ దీవుల ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం తీవ్రంగా మారుతోంది. ఇది శనివారం (అక్టోబర్ 31) నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్ర పరిసరాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. వాయుగుండంగా మారిన అనంతరం, రానున్న రెండు రోజుల్లో అది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. దీని ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయని వివరించారు.

ఆ జిల్లాల్లో మూడు రోజులు వానలు..

ఈ వాయుగుండం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి, కోసిన వ్యవసాయ ఉత్పత్తులు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలో అలల ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. వాయుగుండం కదలికల నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ ఆయా సముద్ర ప్రాంతాల్లోకి చేపల వేటకు వెళ్లరాదని ప్రఖర్ జైన్ హెచ్చరించారు. అల్పపీడన తీరును, వాతావరణ మార్పులను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

రేపే పురపోరు!

- ఉదయం 7 గంటల నుంచి మున్సిపల్ ఎన్నికల పోలింగ్
- కోటి మంది ఓటర్లు, 12 వేల కేంద్రాలు
- 36 వేల మంది పోలీసులతో భద్రత
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : రాష్ట్రంలోని వంద పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ శుక్రవారం (నవంబర్ 1న) జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి మొదలయ్యే ఈ పోలింగ్ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12,244 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 1.03 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ సామగ్రిని ఇప్పటికే మున్సిపల్ కార్యాలయాలకు తరలించిన అధికారులు.. అక్కడినుంచి పోలింగ్ కేంద్రాలకు చేరవేస్తున్నారు.

నిఘా నీడలో ఎన్నికలు..

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,233 కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించారు. ఈ 1,904 కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరిస్తున్నారు. పోలీసు బందోబస్తుతో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫర్లతో నిరంతర నిఘా ఉంచనున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది.

స్వేచ్ఛగా ఓటు వేయాలి..

పోలింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించనున్నారు. ఓటర్లు ఎలాంటి భయం, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు సైలెంట్ గా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు

- ఫిర్యాదులపై తక్షణమే స్పందించి విచారించాలి
- ఎక్కడా ఎలాంటి లోపాలకు తావుండకూడదు
- కలెక్టర్లు, ఎస్పీలు, అధికారుల సమీక్షలో ఎస్ఈసీ పునేఠా

విజయవాడ, అక్టోబర్ 30 (సమయం న్యూస్): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి నిర్లక్ష్యానికి, పక్షపాతానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విజయవాడలోని తన కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, ఇతర అధికారులతో ఎన్నికల ఏర్పాట్లు, భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల ప్రారంభ దశలో ఏడు జిల్లాల్లో కొన్ని ఘటనలు చోటుచేసుకున్నాయని, నామినేషన్లను అడ్డుకోవడం, సిబ్బందిపై ఒత్తిడి తదితర అంశాలపై తమకు ఫిర్యాదులు అందాయని పునేఠా తెలిపారు. ఈ ఫిర్యాదులన్నింటినీ జిల్లా ఎస్పీలు, కలెక్టర్లకు పంపుతున్నామని, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని సూచించారు. ఎన్నికల అక్రమాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో న్యాయం జరగడమే కాదు.. అది ప్రజలకు స్పష్టంగా కనిపించాలని ఎస్ఈసీ పునేఠా అన్నారు. రికార్డులన్నీ న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటాయని, అభ్యంతరాలు ఉన్నవారు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. హింసాత్మక ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావిత జిల్లాల్లో సైతం అధికారులు ఎన్నికల సన్నద్ధతను పూర్తి చేయడంపై ఆయన అభినందనలు తెలిపారు.

మ్యాథ్స్, సైన్స్‌లో తప్పినా టెన్షన్ లేదు

- సీబీఎస్ఈ విద్యార్థులకు తీపికబురు
- స్కిల్ సబ్జెక్టుతో గట్టెక్కే బంపరాఫర్
- 2028 బ్యాచ్ నుంచి కొత్త రూల్స్ అమలు

న్యూఢిల్లీ (సమయం న్యూస్) : పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో తెలియని ఆందోళన మొదలవుతుంది. అందులోనూ మ్యాథ్స్, సైన్స్ లాంటి కఠినమైన సబ్జెక్టులంటే చాలామందికి భయం. ఈ భయాన్ని పోగొడుతూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యార్థులకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది. టెన్త్ బోర్డు పరీక్షల్లో మ్యాథ్స్, సైన్స్, సోషల్ లాంటి ప్రధాన సబ్జెక్టుల్లో ఫెయిలైనా ఇకపై ఏమాత్రం ఇబ్బంది ఉండదని ప్రకటించింది. ఆయా సబ్జెక్టుల స్థానంలో ఏదైనా ఒక నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) సబ్జెక్టును ఎంచుకుని, అందులో ఉత్తీర్ణత సాధిస్తే.. ఆ విద్యార్థిని టెన్త్ పాసైనట్లుగానే పరిగణిస్తామని సీబీఎస్ఈ స్పష్టం చేసింది.

కొత్త విధానం ఎలాగంటే..

సాధారణంగా పదో తరగతిలో విద్యార్థులు కచ్చితంగా ఐదు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. వాటికే పబ్లిక్ పరీక్షలు రాస్తారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం అదనంగా ఒక వృత్తి నైపుణ్య (ఒకేషనల్) కోర్సును ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశం కల్పించారు. ఒకవేళ ఏ విద్యార్థి అయినా లెక్కలు, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం పరీక్షల్లో పాస్ మార్కులు తెచ్చుకోలేక ఫెయిలైతే, వెంటనే ఆ సబ్జెక్టు స్థానంలో వారు ఎంచుకున్న ఒకేషనల్ సబ్జెక్టు మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. అంటే, మెయిన్ సబ్జెక్టుల్లో తప్పినా.. వృత్తి విద్యా సబ్జెక్టుల్లో పాసైతే టెన్త్ గట్టెక్కినట్లే! దీనికోసం బోర్డు ఏకంగా 22 రకాల స్కిల్ సబ్జెక్టులను అందుబాటులో ఉంచింది. వాటిలో నచ్చిన దానిని విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చు.

ఈ బ్యాచ్‌కు మాత్రమే..

అయితే, ఈ బంపరాఫర్ ప్రస్తుత టెన్త్ బ్యాచ్‌కు వర్తించదు. ఈ కొత్త విధానం 2028లో జరిగే బోర్డు పరీక్షల నుంచి అమల్లోకి రానుంది. అంటే, ప్రస్తుతం (2026-27 విద్యా సంవత్సరం) తొమ్మిదో తరగతి చదువుతూ.. వచ్చే ఏడాది పదిలోకి అడుగుపెట్టే విద్యార్థులకు మాత్రమే ఈ కొత్త రూల్ వర్తిస్తుందని అధికారులు విడుదల చేసిన సర్క్యులర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు టెన్త్ చదువుతున్న వారు పాత పద్ధతిలోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

నైన్త్, టెన్త్ సిలబస్‌లో కోత..

ఇదిలా ఉంటే, తొమ్మిదో తరగతి పాఠ్యాంశాల్లో సీబీఎస్ఈ కీలక మార్పులు చేసింది. వృత్తి విద్యను తప్పనిసరి చేస్తూనే, కొన్ని సిలబస్‌లకు కోత పెట్టింది. సమాజంలోని వ్యక్తులు, కంప్యూటేషనల్ థింకింగ్ (సీటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి సబ్జెక్టులను తొలగించింది. ఈ మార్పులు ప్రస్తుతం నైన్త్ చదువుతున్న వారికి తక్షణమే అమల్లోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా, ఇప్పుడు తొమ్మిదిలో ఉన్న వీరు వచ్చే ఏడాది టెన్త్‌కి వెళ్లినప్పుడు వారికి 'పర్యావరణ విద్య' అనే పాఠ్యాంశం కూడా ఉండదు.

తప్పనిసరిగా వృత్తి విద్య..

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు బోర్డు గట్టిగా నిర్ణయించుకుంది. అందుకే తొమ్మిదో తరగతిలో మొదలయ్యే వృత్తి విద్యా పాఠ్యాంశాన్ని, టెన్త్‌లోనూ కచ్చితంగా చదవాల్సిన సబ్జెక్టుగా మార్చింది. 'కౌశల్ వికాశ్' (నైపుణ్యాభివృద్ధి) కింద ఉన్న మొత్తం 22 రకాల పాఠ్యాంశాలలో విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టును ఎంచుకోవచ్చు. ఈ స్కిల్ ఎడ్యుకేషన్ మార్పులన్నీ కేవలం ప్రస్తుత నైన్త్ విద్యార్థుల నుంచే ప్రారంభమవుతాయని సీబీఎస్ఈ అధికారులు వివరించారు.

కేజీ బేసిన్ వివాదానికి మధ్యవర్తి!

కేంద్రం, రిలయన్స్ మధ్య గ్యాస్ తరలింపు రగడ

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : కృష్ణా- గోదావరి (కేజీ) బేసిన్ గ్యాస్ తరలింపు వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) సహా మరో రెండు విదేశీ సంస్థల మధ్య ఉన్న సుదీర్ఘ వివాదంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను ఏకైక మధ్యవర్తిగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

గ్యాస్ తరలింపు వ్యవహారంలో పలు సాంకేతిక సంక్లిష్టతలు ఉన్నందున.. ఇరు పక్షాలు సూచించే ఇద్దరు సబ్జెక్టు నిపుణుల సాయాన్ని కూడా మధ్యవర్తి తీసుకోవచ్చని ధర్మాసనం సూచించింది. కాగా, ఈ విచారణ ప్రక్రియలో మధ్యవర్తికి తమ పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానానికి హామీ ఇచ్చింది.

డబ్బుల్లేకనే ఓడిపోయాం

వైశ్యులంతా వైసీపీకి అండగా నిలవాలి

నిరుపేద మేయర్ అభ్యర్థికి మద్దతు తెలపాలి

బెదిరింపులకు భయపడొద్దు, ఫ్యాన్‌కే ఓటు వేయాలి

మాజీ మంత్రి అంబటి ఆసక్తికర వ్యాఖ్యలు

గుంటూరు, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : గత ఎన్నికల్లో తమ వద్ద డబ్బు లేకపోవడం వల్లే ఓటమి పాలయ్యామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న ఎన్నికలను ఉద్దేశించి గుంటూరు వైసీపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ తరపున బరిలో దిగుతున్న మేయర్ అభ్యర్థి నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఆర్యవైశ్య కులస్తురాలని, ఆమెకే ప్రజలు ఓటు వేయాలని ఆయన కోరారు. ఆర్య వైశ్యులంతా ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. వైసీపీకి ఈ ఎన్నికలు పూర్తిస్థాయి 'ఆర్గానిక్' ఎన్నికలని ఆయన అభివర్ణించారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అవినీతి రహిత, న్యాయబద్ధమైన పరిపాలన అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ముఖ్యంగా ఆర్యవైశ్య సామాజిక వర్గం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల నుంచి బెదిరింపులు ఎదురైతే బెదిరినట్లు నటించాలని, బతిమలాడితే లొంగినట్లు నటించాలని.. కానీ తీరా పోలింగ్ బూత్‌లోకి వెళ్లాక మాత్రం శక్తినంతా కూడదీసుకుని ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని అంబటి అభ్యర్థించారు. నిరుపేద అయిన తమ పార్టీ మేయర్ అభ్యర్థికి ఆర్యవైశ్యులు 'నోటు ఇవ్వండి.. ఓటు వేయండి' అని విజ్ఞప్తి చేశారు.

సౌరవ్‌దాస్ అసలు భారతీయుడేనా?

సీజేపీ నేత పౌరసత్వంపై మద్రాసు హైకోర్టు విచారణ

ఆరు వారాల్లో కౌంటర్ వేయాలని కేంద్రానికి నోటీసులు

నేపాలీ అని తేలితే ఆధార్, పాస్‌పోర్ట్ రద్దుకు డిమాండ్

చెన్నై (సమయం న్యూస్) : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సహ సమన్వయకర్త సౌరవ్‌దాస్ పౌరసత్వం వ్యవహారం మద్రాసు హైకోర్టుకు చేరింది. అతడు అసలు భారతీయుడేనా కాదా అనే విషయంపై ఆరు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. సౌరవ్‌దాస్ జాతీయతపై కేంద్ర హోంశాఖతో సమగ్ర విచారణ జరిపించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ చెన్నైలోని జమీన్‌పల్లావరానికి చెందిన గణేష్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణలో అతడు నేపాలీ పౌరుడని తేలితే.. తక్షణమే అతడికి జారీ చేసిన భారతీయ పాస్‌పోర్ట్, ఆధార్ కార్డును రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, న్యాయమూర్తి జస్టిస్ అరుళ్‌మురుగన్‌ల ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు నోటీసులు ఇచ్చింది.

విదేశీ టూర్.. లోకల్ పేమెంట్!

దుబాయ్, సింగపూర్‌లో మన యూపీఐ సేవలు

బుర్జ్ ఖలీఫా, యూనివర్సల్ స్టూడియోస్‌కు ఆన్‌లైన్ బుకింగ్స్

పది దేశాల్లో యూపీఐకి పచ్చజెండా.. త్వరలో జాబితాలోకి ఉజ్బెకిస్థాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : విదేశాలకు వెళ్లే మన పర్యాటకులకు కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే న్యూస్ చెప్పింది. దుబాయ్, సింగపూర్ వెళ్లే భారతీయులు అక్కడి ఫేమస్ టూరిస్ట్ స్పాట్లలో కూడా మన యూపీఐతోనే పేమెంట్లు చేయొచ్చని శుక్రవారం ఆర్థిక శాఖ ప్రకటించింది. టూర్‌కి వెళ్లి విదేశీ కరెన్సీ కోసం జేబులు తడుముకునే పనిలేకుండా ఫోన్ తీసి ఆన్‌లైన్‌లో ఇట్టే టికెట్లు బుక్ చేసుకునే సదుపాయం తీసుకొచ్చింది. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా, సింగపూర్‌లోని యూనివర్సల్ స్టూడియోస్, ఓషనేరియం, అడ్వెంచర్ కోవ్ వాటర్ పార్క్ లాంటి టాప్ ప్లేస్‌ల టికెట్లను యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లో కొనుక్కోవచ్చని తెలిపింది. ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్ దగ్గర ఇప్పటికే మనవాళ్లు ఈ ఫెసిలిటీ వాడుకుంటున్నారు. సింగపూర్, యూఏఈలతో కలుపుకుని ప్రస్తుతం పది దేశాలు మన యూపీఐ పేమెంట్లను అధికారికంగా అంగీకరిస్తున్నాయి. త్వరలో ఉజ్బెకిస్థాన్ కూడా ఈ లిస్టులో 11వ దేశంగా చేరే ఛాన్స్ ఉంది.

ఢిల్లీకి కదిలిరండి

రేపు రాంలీలా మైదానంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ

సుమారు 10 లక్షల మంది హాజరవుతారని కాంగ్రెస్ అంచనా

వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న వారిని అడ్డుకుంటున్నారని రాహుల్ ఆరోపణ

మోదీ, అమిత్ షా, కార్పొరేట్లకు మేలు చేసేలా కుట్ర అని విమర్శ

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య రక్షణే లక్ష్యంగా దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదానంలో రేపు (నవంబర్ 1న) ఇండియా కూటమి నిర్వహించనున్న భారీ ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి దేశ నలుమూలల నుంచి సుమారు 10 లక్షల మందికి పైగా హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీకి చేరుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు, సామాన్య ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి ర్యాలీకి వస్తున్న వారిని నిలువరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ర్యాలీకి ఎంతమంది వస్తున్నారు? వారిని ఎలా అడ్డుకుంటున్నారు? అన్నది గమనిస్తే దేశంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయని వ్యాఖ్యానించారు. దేశంలో కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారన్న ఆందోళన ప్రజల్లో పెరుగుతోందని, ఈ పరిణామాలపై సర్వత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని ఆయన అన్నారు.

ఒకే లక్ష్యంతో సాగుతున్న ఉద్యమం..

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీ, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌లకు మేలు చేకూర్చేలా కుట్ర పూరితంగా ఈ పరిణామాలు జరుగుతున్నాయని రాహుల్ ఆరోపించారు. రాంలీలా మైదానంలో నిర్వహించే ఈ కార్యక్రమం విడివిడిగా చేపడుతున్న నిరసనల సమాహారం కాదని, ఒకే లక్ష్యంతో సాగుతున్న మహోద్యమమని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో ఇండియా కూటమిలోని ప్రతిపక్ష పార్టీలన్నీ భాగస్వాములవుతాయని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసన తెలియజేయాలనుకునే ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొనాలని రాహుల్ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ బ్యాంకులు అమ్మకానికి కాదు!

ఐడీబీఐ ప్రైవేటీకరణపై కేంద్రానికి రాహుల్ సూటి ప్రశ్న

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ప్రభుత్వ రంగ బ్యాంకులు అమ్మకానికి పెట్టే ఆస్తులు కావని, అవి దేశ నిర్మాణానికి ఉపయోగపడే సంస్థలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. బ్యాంకు ఉద్యోగుల ఆందోళనకు మద్దతుగా శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ఏడేళ్ల క్రితం నష్టాల్లో ఉన్న ఐడీబీఐ.. సిబ్బంది కృషితో గత ఏడాది రూ.9 వేల కోట్లకు పైగా లాభాలు ఆర్జించిందని గుర్తుచేశారు. ఇంతలా లాభాల్లో ఉన్న ప్రభుత్వ బ్యాంకును ఎందుకు విక్రయిస్తున్నారని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. బ్యాంక్ ఉద్యోగుల పోరాటానికి రాహుల్ తన సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు.

పార్లమెంట్‌లో ఇచ్చిన హామీ ఏమైంది?

కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ కంపెనీకి ఐడీబీఐను విక్రయించాలని కేంద్రం నిర్ణయించిందని రాహుల్ ఆరోపించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ చేతుల్లో 95 శాతం ఐడీబీఐ వాటాలు ఉండగా.. విక్రయం తర్వాత అది 34 శాతానికి పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐడీబీఐలో కనీసం 51 శాతం వాటా కొనసాగిస్తామని 2003లో పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. ప్రైవేటీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు ముప్పు ఏర్పడుతుందని, ఉద్యోగుల సర్వీసు నిబంధనలు, ఉద్యోగ భద్రత కూడా ప్రమాదంలో పడతాయని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు.

సీఈసీపై 'జన మహాభియోగ్'

నేడు ఇండియా కూటమి వినూత్న నిరసన

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పనితీరును ఎండగట్టేందుకు ఇండియా కూటమి సన్నద్ధమైంది. ఓటర్ల జాబితాల నుంచి దేశవ్యాప్తంగా సుమారు 13.5 కోట్ల మంది పేర్లను తొలగించారనే ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తున్న విపక్షాలు.. దీనిపై నేడు (శుక్రవారం) 'జన మహాభియోగ్' పేరిట వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో జరగనున్న ఈ భేటీలో.. ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటు హక్కు పరిరక్షణ లక్ష్యంగా 19 పార్టీల నేతలు గళమెత్తనున్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని 'మాక్ పార్లమెంట్' పేరిట నిర్వహించాలని భావించినప్పటికీ, తాజాగా దానిని 'జన మహాభియోగ్'గా మార్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ సమావేశం జరగనుంది. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో.. ఎన్నికల సంఘం తీరు, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రతిపక్ష నేతలు సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తన ప్రారంభోపన్యాసంతో మొదలుపెట్టనుండగా.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముగింపు ప్రసంగం చేయనున్నారు. ఇండియా కూటమిలోని 19 రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఇందులో పాల్గొని తమ వాదనలు వినిపించనున్నారు. ఒక్కో పార్టీ ప్రతినిధికి ఐదు నిమిషాల చొప్పున సమయం కేటాయించారు. మొత్తంగా 30 మంది వక్తలు ఈ సమావేశంలో ప్రసంగించి, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై కూటమి అభిప్రాయాలను ప్రజల ముందుకు తీసుకెళ్లనున్నారు.

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం!

- వంటగ్యాస్, ఎరువుల కొరత అంటూ విపక్షాల పుకార్లు
- రైతులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నాం
- వాతావరణ మార్పులను తట్టుకునేలా 3 వేల కొత్త విత్తన రకాలు
- 24వ విడత పీఎం కిసాన్ నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ
- 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,680 కోట్లు జమ
- గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా భీల్డిలో ప్రధాని వెల్లడి

బనస్కాంత, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో వంటగ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో ఆందోళన సృష్టిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా భీల్డి వేదికగా శుక్రవారం ఆయన ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) 24వ విడత నిధులను విడుదల చేశారు. బటన్ నొక్కి 9.34 కోట్ల మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో డీబీటీ ద్వారా రూ.18,680 కోట్ల నిధులను జమ చేశారు. ఈ విడతలో ఒక్క గుజరాత్‌లోనే 52 లక్షల మంది రైతులకు రూ.1,051 కోట్ల సాయం అందింది. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

భారం పడకుండా చూస్తున్నాం..

దేశ ప్రజలు అభివృద్ధి చెందిన భారత్ కోసం శ్రమిస్తుంటే, కొందరు రాజకీయ నేతలు మాత్రం దేశం సంక్షోభంలో పడాలని కోరుకుంటున్నారని ప్రధాని మోదీ విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, గల్ఫ్‌లో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ.. ఆ ప్రభావం భారత రైతులపై పడకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. కష్టకాలంలో రైతులకు అండగా ఉంటానన్న హామీకి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు.

కొత్తగా3 వేల రకాల విత్తనాలు..

వ్యవసాయంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచేందుకు 12 ఏళ్లుగా చర్యలు తీసుకుంటున్నామని ప్రధాని తెలిపారు. రైతులు తమ భూములకు ఏ ఎరువులు వేయాలో తెలుసుకునేలా దేశవ్యాప్తంగా 26 కోట్లకు పైగా సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశామన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా గత కొన్నేళ్లలో సుమారు 3 వేల కొత్త రకాల విత్తనాలను రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. అలాగే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో పశుపోషణ, డెయిరీ రంగాలు కీలకమన్న మోదీ.. ఈ రంగాల్లో మహిళల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఆధునిక సాంకేతికత ద్వారా పాల ఉత్పత్తిని మరింత పెంచుకోవచ్చని మోదీ ఆకాంక్షించారు. కాగా, పీఎం కిసాన్ కింద ఏటా రైతుల ఖాతాల్లో కేంద్రం రూ.6 వేలు వేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు 24 విడతల్లో దాదాపు రూ.4.65 లక్షల కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

చమోలీలో కుప్పకూలిన చాపర్!

ఫాటా నుంచి బద్రీనాథ్ వెళ్తుండగా ప్రమాదం

హెలికాప్టర్‌లో ఐదుగురు ప్రయాణికులు, పైలట్

వాతావరణం అనుకూలించక గాలింపునకు ఆటంకం

డెహ్రాడూన్ (సమయం న్యూస్) : ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ప్రైవేట్ హెలికాప్టర్ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఫాటా నుంచి బద్రీనాథ్ వెళ్తున్న ట్రాన్స్ భారత్ కంపెనీకి చెందిన హెలికాప్టర్ జోషిమఠ్ సమీపంలో కుప్పకూలినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. హతి పహాడ్ వెనుక ఉన్న చాయి గ్రామ పరిసరాల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో చాపర్‌లో ఐదుగురు ప్రయాణికులు, ఒక పైలట్ ఉన్నారు. దట్టమైన మేఘాలు, భారీ వర్షం కారణంగా గాలింపు చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి శకలాలు లభ్యం కాలేదు. అందులో ఉన్నవారి పరిస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు.

అలముకున్న దట్టమైన మేఘాలు..

ప్రమాదానికి గురైన హెలికాప్టర్‌లో ప్రయాణికులను చంద్రకాంత్, రాజశ్రీ, దినేష్, ఆకాష్, అథర్వగా.. పైలట్‌ను హిమాంశుగా అధికారులు గుర్తించారు. ఆ ప్రాంతంలో దట్టమైన మేఘాలు కమ్ముకుని తక్కువ దృశ్యమానత ఉండటంతో ప్రమాద స్థలాన్ని గుర్తించడం కష్టంగా మారింది. బద్రీనాథ్, జోషిమఠ్ పరిసరాల్లో ఎస్డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు గాలింపు ముమ్మరం చేశారు. సహాయక చర్యల కోసం అదనంగా మరో రెండు హెలికాప్టర్లను సిద్ధం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆందోళన వ్యక్తం చేశారు. యంత్రాంగం అంతా సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్ చేపడుతోందని, ప్రయాణికులంతా క్షేమంగా బయటపడాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కాగా, చార్‌ధామ్ యాత్రలో వాతావరణం, సాంకేతిక సమస్యల వల్ల అక్టోబర్‌లోనూ రెండు హెలికాప్టర్లు అత్యవసరంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే.

సారా దర్శనంపై ఫత్వా!

కేదార్‌నాథ్ వెళ్లడాన్ని తప్పుబట్టిన మతపెద్ద

సారా ఆధ్యాత్మిక స్వేచ్ఛకు నెటిజన్ల మద్దతు

ముంబై (సమయం న్యూస్) : బాలీవుడ్ నటి సారా అలీఖాన్ కేదార్‌నాథ్ ఆలయ దర్శనం వివాదాస్పదంగా మారింది. ఆమె ఆలయంలో పూజలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ.. ఆమెకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేశారు. ఇతర మతాల ఆచారాలు, ప్రార్థనల్లో పాల్గొనడం ఇస్లామిక్ నియమాలకు విరుద్ధమని, ఇందుకు అల్లాహ్‌ను క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. అయితే, సారా వ్యక్తిగత విశ్వాసాలపై ఆంక్షలు విధించడం తగవంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ఆమెకు అండగా నిలుస్తున్నారు.

క్షమాపణలు కోరాల్సిందే..

గత వారం ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించిన సారా.. సాధారణ భక్తులతో పాటు క్యూలో నిలబడి దర్శనం చేసుకున్నారు. దీనిపై కొందరు యువ ముస్లింలు తనను ప్రశ్నించారని ఆల్ ఇండియా ముస్లిం జమాత్ జాతీయ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ తెలిపారు. ముస్లిం మహిళలు, పురుషులు ఇతర మతాల విశ్వాసాలను అనుసరించడం షరియత్ ప్రకారం అనుమతించబడదని స్పష్టం చేశారు. సారా ఆలయ దర్శనం, పూజల్లో పాల్గొనడం పాపమని (హరామ్), తక్షణమే ఆమె పశ్చాత్తాపం చెంది క్షమాపణలు కోరాలని ఆయన సూచించారు.

కేదార్‌నాథ్‌తో ప్రత్యేక అనుబంధం..

సారా ఆలయాల సందర్శనపై విమర్శలు రావడం ఇదే తొలిసారి కాదు. 2021 నవంబర్‌లో కేదార్‌నాథ్ వెళ్లినప్పుడు కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే, గుడులకు వెళ్లడం తన వ్యక్తిగత నిర్ణయమని 2023 జూన్‌లో సారా స్పష్టం చేశారు. దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌తో కలిసి నటించిన తన తొలి చిత్రం 'కేదార్‌నాథ్' (2017) షూటింగ్ ఇక్కడే జరగడంతో సారాకు ఆ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఏర్పడింది.

బైనాన్స్‌పై కనీవినీ ఎరుగని సైబర్ దాడి!

- ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో చోరీ
- 20 నిమిషాల్లోనే రూ.56 వేల కోట్లు లూటీ
- పది బ్లాక్‌చెయిన్ నెట్‌వర్క్‌ల వాలెట్లపై ఎటాక్
- ఉత్తర కొరియా హ్యాకర్ల పనేనని తీవ్ర అనుమానాలు
- వినియోగదారులకు అభయమిచ్చిన బైనాన్స్ యాజమాన్యం

న్యూయార్క్, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ అయిన బైనాన్స్‌లో కనీవినీ ఎరుగని రీతిలో సైబర్ దాడి జరిగింది. అక్టోబర్ 30న సైబర్ నేరగాళ్లు ఏకంగా 6.3 బిలియన్ డాలర్లు.. అంటే మన కరెన్సీలో సుమారు రూ.56 వేల కోట్లకు పైగా విలువైన డిజిటల్ ఆస్తులను ఊడ్చేశారు. ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద క్రిప్టో దొంగతనంగా రికార్డుకెక్కిన ఈ భారీ స్కామ్ అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. ఈ హైటెక్ చోరీ వెనుక ఉత్తర కొరియాకు చెందిన కరుడుగట్టిన హ్యాకింగ్ ముఠా ఉన్నట్లు అంతర్జాతీయ బ్లాక్‌చైన్ విశ్లేషణ సంస్థలు బలంగా అనుమానిస్తున్నాయి.

రెప్పపాటులో రూ.56 వేల కోట్లు మాయం..

అమెరికాకు చెందిన ప్రముఖ బ్లాక్‌చెయిన్ విశ్లేషణ సంస్థ 'టీఆర్ఎమ్ ల్యాబ్స్' వెల్లడించిన వివరాల ప్రకారం.. హ్యాకర్లు అత్యంత పకడ్బందీగా ఈ దాడికి వ్యూహం పన్నారు. బైనాన్స్‌కు చెందిన పది వేర్వేరు బ్లాక్‌చెయిన్ నెట్‌వర్క్‌ల్లోని వాలెట్లను టార్గెట్ చేశారు. రెప్పపాటు వ్యవధిలోనే ఏకంగా 6.36 బిలియన్ డాలర్ల విలువైన క్రిప్టో ఆస్తులను తమ ఖాతాల్లోకి మళ్లించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ లావాదేవీల్లో అత్యధిక భాగం కేవలం ఇరవై నిమిషాల్లోనే పూర్తయిపోవడం. భద్రతా వ్యవస్థలు పసిగట్టేలోపే హ్యాకర్లు తమ పని పూర్తి చేసుకుని ఉడాయించారు. ఈ స్థాయిలో భారీ దాడి చేయడం సాదాసీదా హ్యాకర్ల వల్ల కాదని.. దీని వెనుక ఉత్తర కొరియాతో సత్సంబంధాలు ఉన్న 'ట్రేడర్స్ ట్రైటర్' అనే హ్యాకింగ్ బృందం హస్తం ఉందని టీఆర్ఎమ్ ల్యాబ్స్ అనుమానిస్తోంది. మరో దిగ్గజ సంస్థ 'చైన్ అనాలిసిస్' కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తోంది. ఈ ముఠాకు గతంలోనూ ఇలాంటి భారీ దొంగతనాలు చేసిన చరిత్ర ఉంది. ముఖ్యంగా 2025 ఫిబ్రవరిలో బైబిట్ క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లో జరిగిన 1.5 బిలియన్ డాలర్ల హ్యాకింగ్ ఘటనలోనూ ఇదే ముఠా ప్రమేయం ఉందని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ ఆరోపించడం గమనార్హం.

బాధితులకు బైనాన్స్ భరోసా..

ఇంత భారీ నష్టం జరిగినా.. బైనాన్స్ సంస్థ తక్షణమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టింది. ఇతర భాగస్వామ్య సంస్థల సహకారంతో ఎక్కడికక్కడ లావాదేవీలను స్తంభింపజేసి సుమారు 3 బిలియన్ డాలర్ల నిధులను హ్యాకర్లు వాడుకోకుండా నిలిపివేసినట్లు ప్రకటించింది. పెట్టుబడిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది.

వినియోగదారులకు జరిగిన నష్టాన్ని పూర్తిగా భర్తీ చేసేందుకు ఏకంగా 6.34 బిలియన్ డాలర్లకు పైగా కంపెనీ నిధులను ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించింది.

బైనాన్స్ హ్యాకింగ్ వార్తలతో అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్‌లో తీవ్ర గందరగోళం, భయాందోళనలు నెలకొన్నాయి. మదుపర్లు భయంతో అమ్మకాలకు దిగడంతో బిట్‌కాయిన్ ధర ఏకంగా 4 శాతం పడిపోయింది. ఈథర్ సహా ఇతర ప్రధాన క్రిప్టో కరెన్సీలు సైతం భారీ నష్టాలను చవిచూశాయి. ఈ దాడికి ఉత్తర కొరియానే కారణమని అధికారికంగా నిర్ధారణ కాకపోయినా.. డిజిటల్ ఆస్తుల భద్రత, ఎక్స్ఛేంజ్‌ల నమ్మకంపై ఈ ఘటన మరోసారి తీవ్రస్థాయిలో ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి!

శాస్త్రవేత్తలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దిశానిర్దేశం

రైతులు ఆధునిక సాగు పద్ధతులు పాటించాలని పిలుపు

రాజేంద్రనగర్‌లో ఘనంగా పీఎం-కిసాన్ ఉత్సవ్ దివస్

కొత్త వరి వంగడాలపై రైతులకు అవగాహన

హైదరాబాద్, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా శాస్త్రవేత్తలు వినూత్న పరిశోధనలు చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్‌లో నిర్వహించిన 'రైతుల దినోత్సవం, పీఎం-కిసాన్ ఉత్సవ్ దివస్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులను అభివృద్ధి చేసి రైతులకు చేరువ చేయాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందన్నారు. అలాగే, రైతులు కూడా సంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది రైతులు పాల్గొనగా.. వారికి కొత్త వరి వంగడాలు, పురుగుమందుల సరైన వినియోగంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

న్యాయమూర్తులపై విమర్శలు చేస్తే చర్యలే!

వ్యక్తిగత దూషణలకు దిగే సభలకు అనుమతి ఇవ్వొద్దు

తమిళనాడు పోలీసులకు మద్రాస్ హైకోర్టు ఆదేశం

ఆన్‌లైన్‌లో భయభ్రాంతులకు గురిచేస్తే సైబర్‌క్రైం కఠిన చర్యలు

న్యాయసంస్థల భద్రత చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని స్పష్టీకరణ

చెన్నై, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : పదవిలో ఉన్న న్యాయమూర్తులను వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకుని, వారిని కించపరిచేలా లేదా భయభ్రాంతులకు గురిచేసే ఉద్దేశంతో నిర్వహించే ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ప్రదర్శనలకు అనుమతి ఇవ్వరాదని మద్రాస్ హైకోర్టు తమిళనాడు పోలీస్ శాఖను ఆదేశించింది. ఒకవేళ ఇతర కారణాలతో అనుమతి

పొందిన సమావేశంలో న్యాయమూర్తులపై వ్యక్తిగత విమర్శలకు దిగితే.. అధికారులు వెంటనే ఆ కార్యక్రమాన్ని నిలిపివేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. పదవిలో ఉన్న న్యాయమూర్తులను ఆన్‌లైన్ కంటెంట్ ద్వారా భయభ్రాంతులకు గురిచేసే నేరపూరిత చర్యలు జరుగకుండా చూడాలని, అలాంటి ఉల్లంఘనలు జరిగినపక్షంలో సైబర్‌క్రైం విభాగం చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మన న్యాయసంస్థల భద్రతకు, సమగ్రతకు ముప్పు కలిగించేలా బహిరంగ ప్రదేశాలు లేదా డిజిటల్ నెట్‌వర్క్‌లను ఎవరూ ఉపయోగించకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేసింది. మత మార్పిడి జరిగినంత మాత్రాన ఒక వ్యక్తి వెనుకబడిన తరగతికి చెందిన ప్రయోజనాలను పొందలేరంటూ గత జూన్‌లో ఇచ్చిన తీర్పును ఉద్దేశించి కొంతమంది వ్యక్తులు, సంస్థలు న్యాయమూర్తులపై విమర్శలకు దిగారు. వారిపై చర్యలు చేపట్టాలంటూ చెన్నైకి చెందిన కార్తికేయన్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, న్యాయమూర్తి జస్టిస్ జి.అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ తీర్పు వెలువరించింది. నిజమైన న్యాయ స్వతంత్రత అంటే న్యాయమూర్తులు తమ ముందున్న చట్టం, వాస్తవాల ఆధారంగా మాత్రమే కేసులపై నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను కలిగి ఉండాలని న్యాయస్థానం అభిప్రాయపడింది.

ఇస్రో మరో అద్భుతం!

విజయవంతమైన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం

నిర్ణీత కక్ష్యలోకి చేర్చిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్

దేశీయ నావిక్ వ్యవస్థ కోసం రెండోతరం శాటిలైట్

1,500 కిలోమీటర్ల పరిధిలో దిక్సూచి సేవలు

శ్రీహరికోట, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. గగనతలంలో మన దిక్సూచి సేవల కోసం ఉద్దేశించిన రెండోతరం నావిగేషన్ ఉపగ్రహ సిరీస్‌లో మూడోదైన ఎన్‌వీఎస్-03 (నావిక్-3) ఉపగ్రహం దిగ్విజయంగా కక్ష్యలోకి చేరింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ రెండో ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం రాత్రి 11:51 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన రాకెట్.. 2,250 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని 18 నిమిషాల 45 సెకన్లలోనే సునాయాసంగా భూస్థిర బదిలీ కక్ష్యలో విడిచిపెట్టింది. ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి చేరిన వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ సహచర శాస్త్రవేత్తలతో ఆనందం పంచుకున్నారు. ఈ ప్రయోగం కోసం శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడ్డారని, ఈ విజయం ఇస్రో చరిత్రలో మరో మైలురాయి అని ఆయన ప్రకటించారు. ఉపగ్రహం స్థిరంగా ఉన్నట్లు బెంగళూరులోని కంట్రోల్ స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయని తెలిపారు. గతంలో 2025లో చేపట్టిన ఎన్‌వీఎస్-02 ప్రయోగం విఫలమైన నేపథ్యంలో.. ఆ లోపాలను సరిదిద్ది ఎన్‌వీఎస్-03ను బెంగళూరులోని స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లో సిద్ధం చేశారు. ఇందులో స్వదేశీ రుబీడియం అటామిక్ క్లాక్ ఉంది. భారత ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ వ్యవస్థ (నావిక్) సేవల కొనసాగింపు కోసం ఇది పనిచేస్తుంది. భారత భౌగోళిక పరిధితో పాటు, సరిహద్దుల ఆవల 1,500 కిలోమీటర్ల పరిధి వరకూ ఈ వ్యవస్థ కవర్ చేస్తుంది. అమెరికాకు చెందిన జీపీఎస్, రష్యాకు చెందిన గ్లోనాస్ మాదిరిగానే మనకు సొంతంగా సేవలందించేందుకు 2006లో కేంద్రం ఈ వ్యవస్థకు ఆమోదం తెలిపింది. ఇప్పటి వరకు ఇస్రో 12 నావిగేషన్ ఉపగ్రహాలను ప్రయోగించగా.. ప్రస్తుతం పలు ఉపగ్రహాలు దేశానికి నావిక్ సేవలు అందిస్తున్నాయి.

జనగణనకు ముహూర్తం ఖరారు!

- 2027 జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ
- జనవరి 10 నుంచి 24 వరకు పౌరులకు ఆన్‌లైన్ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఛాన్స్
- మార్చి 1 నుంచి 5 వరకు సవరణలకు అవకాశం
- ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, మంచు ప్రాంతాలకు మినహాయింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : దేశంలో జనాభా లెక్కలకు షెడ్యూల్ ఖరారైంది. 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు దేశవ్యాప్తంగా జనగణన జరగనుంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, మంచు ప్రభావిత ప్రాంతాల్లో మినహా దేశవ్యాప్తంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వచ్చి పౌరుల వివరాలు సేకరిస్తారు. అంతకముందు 2027 జనవరి 10 నుంచి జనవరి 24వ తేదీ వరకు పౌరులకు ఆన్‌లైన్ లేదా నిర్దేశిత విధానంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశమిచ్చారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, జనాభా లెక్కల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ శుక్రవారం జారీ చేశారు. 2027 మార్చి 1ని జనగణనకు రిఫరెన్స్ తేదీగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మార్చి 1 నుంచి మార్చి 5వ తేదీ వరకు సవరణలకు అవకాశమిచ్చారు. అయితే, వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మణిపూర్, గోవా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌కు, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో మంచు ప్రభావిత ప్రాంతాలకు ఈ ఉత్తర్వులు వర్తించవు. జనాభా లెక్కల ప్రక్రియ రెండు దశల్లో నిర్వహిస్తారు. తొలిదశలో ఇళ్ల జాబితా, గృహ పరిస్థితులు, సౌకర్యాల వివరాల సేకరణ ఇప్పటికే పూర్తైంది. రెండో దశలో సామాజిక, ఆర్థిక వివరాలను నమోదు చేస్తారు.

ఓట్ల తొలగింపుపై సుప్రీం సీరియస్!

- నకిలీ దరఖాస్తులపై తక్షణ చర్యలు చేపట్టాలని ఈసీకి ఆదేశం
- యూపీలో పెద్ద ఎత్తున ఫారం-7 దుర్వినియోగం
- ఒకే బీజేపీ నేత 32 ఫారాలు సమర్పించారని కోర్టుకు విన్నపం
- ఢిల్లీలో 47.56 లక్షల ఓటర్ల తొలగింపుపై ఇంటింటి సర్వే

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పేర్లను తొలగించడానికి ఉద్దేశించిన ఫారం-7ను దుర్వినియోగం చేస్తూ పెద్ద ఎత్తున నకిలీ దరఖాస్తులను సమర్పిస్తుండటంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపి తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున బోగస్ ఫారం-7 దరఖాస్తులు సమర్పిస్తున్నారంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు వేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. పెద్ద సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు దాఖలైనట్లు గుర్తించామని, వాటిని అధికారులు పరిశీలించి నకిలీవని తేల్చారని ఎన్నికల సంఘం న్యాయవాదులు వెల్లడించారు. అయితే ఒక నియోజకవర్గంలో ముస్లిం వర్గానికి చెందిన ఓటర్లను తొలగించడమే లక్ష్యంగా ఓ బీజేపీ నేత ఏకంగా 32 ఫారం-7 పత్రాలు సమర్పించారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. అందులో రెండు ఫారాలపై బీఎల్‌వోల సంతకాలు కూడా ఉన్నాయన్నారు. యూపీలో సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లే తెలంగాణ, కర్ణాటకల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మరోవైపు ఢిల్లీలో తొలగించిన 47.56 లక్షల ఓటర్ల అర్హతను పునఃపరిశీలించేందుకు ఇంటింటి సర్వేను ముమ్మరం చేయనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. సర్ ప్రక్రియ గడువును నవంబరు 25 వరకు పొడిగిస్తున్నట్లు ఈసీ ప్రకటించిన నేపథ్యంలో.. నవంబరు 15, 22వ తేదీల్లో విద్యార్థులు, నిరాశ్రయులు, ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్ల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

ఇంటికే పార్శిల్!

వినియోగదారులకు భారతీయ రైల్వే కొత్త సేవలు

'ఘర్ సే ఘర్ తక్' పేరిట ఇంటి వద్దకే డెలివరీ

తొలి దశలో హైదరాబాద్ సహా 8 నగరాల్లో సదుపాయం

యాప్ ద్వారా పార్శిల్ పికప్, డెలివరీ బుకింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : వినియోగదారుల ఇబ్బందులకు చెక్ పెడుతూ భారతీయ రైల్వే కొత్త సేవలకు శ్రీకారం చుట్టింది. 'ఘర్ సే ఘర్ తక్' పేరిట దేశంలోనే తొలిసారిగా పార్శిల్ డెలివరీ సేవలను నేరుగా ఇంటికే తీసుకురానుంది. హైదరాబాద్ సహా ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, బెంగళూరు, పుణే వంటి 8 ప్రధాన నగరాల్లో ఈ సేవలు తొలిదశలో అందుబాటులోకి రానున్నాయి. 'రైల్వే పార్శిల్ యాప్' లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఒక్క క్లిక్‌తో ఇళ్ల నుంచే పార్శిల్ పికప్, డెలివరీ సర్వీసులను బుక్ చేసుకోవచ్చు. రైలు బయలుదేరే సమయానికి 15 రోజుల ముందు నుంచి ఒకరోజు ముందు వరకు బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. లైవ్ ట్రాకింగ్‌తో పార్శిల్ ఎక్కడుందో సులభంగా తెలుసుకోవచ్చు.

గిగ్ కార్మికులకు భరోసా!

జాతీయ సామాజిక భద్రతా బోర్డుల ఏర్పాటు

కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ

కార్మికులకు సమగ్ర సామాజిక భద్రత కల్పనే లక్ష్యం

అసంఘటిత, గిగ్ వర్కర్లకు వేర్వేరుగా బోర్డులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : దేశంలో భారీ సంఖ్యలో ఉన్న అసంఘటిత, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సమగ్ర సామాజిక భద్రతను కల్పించే దిశగా కేంద్రప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సామాజిక భద్రతా కోడ్- 2020 చట్టం కింద అసంఘటిత రంగంలోని కార్మికులు, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల కోసం రెండు వేర్వేరు జాతీయ సామాజిక భద్రతా బోర్డులను ఏర్పాటు చేస్తూ కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆయా కార్మికుల మధ్య సామాజిక భద్రతా అంతరాన్ని పూడ్చేలా లక్షిత సంక్షేమ పథకాలను రూపొందించడం, పర్యవేక్షించడం, సిఫార్సు చేయడం ఈ బోర్డుల ప్రధాన విధి. ఈ బోర్డులు నోటిఫికేషన్ ప్రచురితమైన తేదీ నుంచి మూడేళ్ల పాటు అమల్లో ఉంటాయి. ఈ రెండు బోర్డులకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి చైర్‌పర్సన్‌గా, ఆ శాఖ కార్యదర్శి వైస్ చైర్‌పర్సన్‌గా ఉంటారు. వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రముఖ అగ్రిగేటర్ కంపెనీలు, వాటి యజమానులు, పౌర సమాజ సంస్థలు, కార్మిక సంఘాలు, గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ కార్మిక సంఘాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. అసంఘటిత కార్మికుల బోర్డులో తెలంగాణ నుంచి బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాస్, హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ జలిగాం నామినేట్ అయ్యారు. ఏపీ తరఫున కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శికి ఈ బోర్డులో చోటు దక్కింది. గిగ్ వర్కర్ల బోర్డులో ఏపీ నుంచి కార్మిక శాఖ కమిషనర్ సభ్యుడిగా ఉన్నారు.

రీలోడ్ చేసి మరీ కాల్చాడు!

లఖ్‌నవూ ట్రిపుల్ మర్డర్ కేసులో వెలుగులోకి భయానక వీడియో

పార్కింగ్ గొడవతో ఒకే కుటుంబంలో ముగ్గురి దారుణ హత్య

22 సెకన్లలో ఐదుసార్లు కాల్పులు జరిపిన మాజీ నేవీ అధికారి

వీడియో బయటపడటంతో నివ్వెరపోతున్న స్థానికులు

లఖ్‌నవూ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో ఈనెల 26న జరిగిన ట్రిపుల్ మర్డర్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సాదత్‌గంజ్ ప్రాంతంలో కేవలం కారు పార్కింగ్ స్థలం వివాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దారుణంగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించిన ఓ భయానక వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో నిందితుడు కేవలం 22 సెకన్ల వ్యవధిలోనే ఐదు సార్లు కాల్పులు జరపడం, దాడి చేసే మధ్యలో కూల్‌గా తుపాకీని రీలోడ్ చేసుకోవడం చూసి జనం నివ్వెరపోతున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లఖ్‌నవూలోని సాదత్‌గంజ్ ప్రాంతంలో అక్టోబర్ 26న కారు పార్కింగ్ విషయంలో రెండు కుటుంబాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన 30 ఏళ్ల శుక్లా అనే వ్యక్తి తన వద్ద ఉన్న తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో శివాజీ తివారీ (62), శివేంద్ర తివారీ (55), సుయాశ్ తివారీ (30) అనే ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వారిని వెంటనే కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ (కేజీఎంయూ) ట్రోమా సెంటర్‌కు తరలించారు. అయితే అప్పటికే వారు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈ దారుణ ఘటనకు సంబంధించి ఓ వీడియో బయటకు వచ్చింది. అందరూ చూస్తుండగానే నిందితుడు శుక్లా కేవలం 22 సెకన్ల వ్యవధిలో ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు వీడియోలో స్పష్టంగా కనిపించింది. రెండు రౌండ్లు కాల్చి.. అనంతరం గన్‌ను రీలోడ్ చేసి మరో మూడు బులెట్లు కాల్చినట్లు ఆ క్లిప్‌లో ఉంది. 'నన్ను ఇటుకతో కొట్టారు. అందుకే కాల్చాను' అని నిందితుడు అనడం ఆ వీడియోలో రికార్డైంది. ఈ దారుణ ఘటనపై మృతుడు శివేంద్ర తివారీ భార్య రుచి తివారీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ప్రధాన నిందితుడు శుక్లా మర్చంట్ నేవీలో నావిగేషన్ ఆఫీసర్‌గా పనిచేసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతడి వద్ద నుంచి తుపాకీతో పాటు నాలుగు బులెట్లను స్వాధీనం చేసుకున్నారు.

నేవీలోకి రఫేల్!

ఐఎన్ఎస్ విక్రాంత్‌పై విజయవంతంగా ల్యాండ్ అయిన ఫైటర్ జెట్

నెట్టింట వైరల్ అవుతున్న రఫేల్ ల్యాండింగ్ వీడియో

ఫ్రాన్స్‌తో కుదిరిన రూ.63 వేల కోట్ల డీల్‌లో కీలక ఘట్టం

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : భారత వాయుసేనలో తాజాగా మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. అత్యాధునిక ఫైటర్ జెట్ రఫేల్ తొలిసారిగా యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మొదటిసారి అక్టోబర్ 29న విజయవంతంగా ల్యాండయ్యింది. ఐఎన్ఎస్ కార్యకలాపాలకు అనుగుణంగా రఫేల్‌లో మార్పులకు భారత నేవీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా కీలక ఘట్టమైన ల్యాండింగ్ దిగ్విజయంగా పూర్తయ్యింది. నేవీలోకి పూర్తిస్థాయిలో రఫేల్‌ను ప్రవేశపెట్టేందుకు ఇది ముఖ్య ఘట్టమని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

రఫేల్ కోసం ఫ్రాన్స్‌తో డీల్..

భారత్‌కు అవసరమైన 26 రఫేల్ యుద్ధ విమానాల కోసం ఫ్రాన్స్‌తో 2025లో ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. రూ.63 వేల కోట్ల డీల్‌లో భాగంగా 22 సింగిల్ సీటర్ జెట్స్‌తో పాటు నాలుగు ట్విన్ సీటర్ జెట్స్‌ను ఫ్రాన్స్ సరఫరా చేయనుంది. ఫైటర్ జెట్స్‌తో పాటు ఆయుధాలు, శిక్షణ, సిమ్యులేటర్లు, ఇతర పరికరాలన్నీ ఫ్రాన్స్ సమకూర్చేలా ఒప్పందం కుదిరింది. 2030 నాటికి విమానాల్ని సరఫరా అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే భారత సిబ్బంది ఈ ఫైటర్ జెట్స్‌కు సంబంధించిన శిక్షణ పొందుతున్నారు. ఈ డీల్‌లో భాగంగా రఫేల్ ఫ్యూజిలాజ్ తయారీ, నిర్వహణ, రిపేర్లకు సంబంధించిన కేంద్రాలను భారత్‌లో ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలను రఫేల్‌తో జతపరిచేందుకు కావాల్సిన సాంకేతికతను బదిలీ చేసేందుకు కూడా ఫ్రాన్స్ అంగీకరించింది.

ఇజ్రాయెల్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం!

- ఎన్నికల్లో ఏ పార్టీకీ దక్కని స్పష్టమైన మెజారిటీ
- 53 స్థానాలతో తొలిస్థానంలో నిలిచిన నెతన్యాహు కూటమి
- ప్రతిపక్ష కూటమికి 48, అరబ్ పార్టీలకు 19 స్థానాలు
- ప్రభుత్వ ఏర్పాటుపై కొనసాగుతున్న సందిగ్ధత
- భారత్ సంబంధాలపై ప్రభావం ఉండొచ్చని అంచనా

జెరూసలెం, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ఇజ్రాయెల్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు మళ్లీ రాజకీయ అనిశ్చితికి తెరతీశాయి. అక్టోబర్ 27న జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ లభించలేదు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ కూటమి అత్యధికంగా 53 స్థానాలు గెలుచుకున్నప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 స్థానాల మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేకపోయింది. మరోవైపు మాజీ సైనికాధికారి గాడి ఐసెన్‌కాట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు వచ్చాయి. అనూహ్యంగా అరబ్ పార్టీలకు రికార్డు స్థాయిలో 19 స్థానాలు లభించాయి. గతేడాది (2023 అక్టోబర్ 07) హమాస్ దాడి, దాని తర్వాత గాజా, లెబనాన్, ఇరాన్‌తో యుద్ధాల అనంతరం ఇజ్రాయెల్‌లో జరిగిన మొట్టమొదటి జాతీయ ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. 120 మంది సభ్యులున్న ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో మెజారిటీ సాధించాలంటే 61 స్థానాలు అవసరం. దీంతో నెతన్యాహు మరోసారి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించే అవకాశముంది. అయితే ప్రతిపక్ష కూటమి కూడా అరబ్ పార్టీల మద్దతుతో 67 స్థానాలను సమీకరించగలదు. కానీ అరబ్ పార్టీలతో కలిసి పనిచేయడానికి కొంత మంది ప్రతిపక్ష నేతలు విముఖత చూపుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది. మరోవైపు, ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో చర్చలు విఫలమైతే మరోసారి ఎన్నికలకు వెళ్లాల్సిన పరిస్థితి రావచ్చు.

ఇజ్రాయెల్ రాజకీయ పరిణామాలు ఇరాన్, గాజాపై ఆ దేశ వైఖరిని ప్రభావితం చేయనున్నాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతలు, గాజా భవిష్యత్తు, వెస్ట్ బ్యాంక్‌లో పరిస్థితులు ఇప్పటికే సవాళ్లుగా ఉన్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడినా ఇరాన్, హమాస్ విషయంలో ఇజ్రాయెల్ కఠిన వైఖరిలో పెద్ద మార్పు ఉండకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గాజాలో హమాస్ నిరాయుధీకరణపై నెతన్యాహు, ఐసెన్‌కాట్ ఇద్దరూ ఒకే వైఖరితో ఉన్నారు.

భారత్‌కు ఎందుకంత కీలకం?

ఇజ్రాయెల్‌తో భారత్‌కు రక్షణ, సాంకేతిక రంగాల్లో బలమైన సంబంధాలున్నాయి. డ్రోన్లు, వైమానిక రక్షణ వ్యవస్థలు, సైబర్ భద్రత, వ్యవసాయం, అంతరిక్ష రంగాల్లో ఇరు దేశాలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఈ ఏడాది (2026) ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లారు. అయితే ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరిగితే భారత్‌కు ఇంధన సరఫరా, వాణిజ్య మార్గాలు, గల్ఫ్ ప్రాంత భద్రతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే ఇజ్రాయెల్‌తో సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే అరబ్ దేశాలు, ఇరాన్‌తో దౌత్య సంబంధాలను కొనసాగించడం భారత్‌కు అత్యంత కీలకంగా మారనుంది.

రియల్ హీరో కండక్టర్!

- బ్రేకులు ఫెయిల్ కావడంతో వెనక్కి వెళ్లిన బస్సు
- రాళ్లు అడ్డువేసి ప్రమాదాన్ని ఆపిన కండక్టర్
- భయంతో బస్సులో నుంచి దూకేసిన ప్రయాణికులు
- జార్ఖండ్‌లోని దుమ్కాలో ఘటన..

రాంచీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : జార్ఖండ్‌లోని దుమ్కాలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బ్రేకులు ఫెయిలై బస్సు అదుపు తప్పడంతో అందులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అదే సమయంలో ఓ కండక్టర్ తన సమయస్ఫూర్తితో ఘోర ప్రమాదాన్ని తప్పించాడు. బస్సు బ్రేకులు ఫెయిలై ఏటవాలు ప్రాంతంలో వెనక్కి వెళ్తున్న సమయంలో ఏ మాత్రం భయపడకుండా అతడు వ్యవహరించిన తీరు పలువురి ప్రాణాలను కాపాడింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుమ్కా ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సుకు అకస్మాత్తుగా బ్రేకులు ఫెయిలయ్యాయి. ఆ ప్రాంతంలోని రోడ్డు ఏటవాలుగా ఉండటంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు ఒక్కసారిగా వెనక్కి వెళ్లడం ప్రారంభించింది. బస్సు అదుపుతప్పి వెనక్కి వెళ్లడాన్ని గమనించిన ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణభయంతో ఒక్కొక్కరు బస్సులో నుంచి కిందకు దూకారు. ఒక వైపు ప్రయాణికులు బస్సులో నుంచి దూకుతుంటే.. మరోవైపు కండక్టర్ అత్యంత సాహసోపేతంగా వ్యవహరించాడు. బస్సు వేగంగా వెనక్కి వెళ్లకుండా ఉండేందుకు వెంటనే పెద్ద పెద్ద బండరాళ్లను సేకరించి చక్రాల కింద వేయడం ప్రారంభించాడు. అతని ఈ సమయస్ఫూర్తి వల్ల బస్సు వేగం క్రమంగా తగ్గి చివరకు పూర్తిగా నిలిచిపోయింది. కండక్టర్ సమయస్ఫూర్తి కారణంగా ఘోర ప్రమాదం తప్పిందని నెటిజన్లు చెబుతున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారని సమాచారం. ఈ ఘటన సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ప్రమాద సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా ప్రయాణికులను కాపాడిన కండక్టర్ తెగువను నెటిజన్లు, స్థానికులు తెగ అభినందిస్తున్నారు. అతడు రియల్ హీరో అంటూ ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

కరువు నుంచి విముక్తి!

లా నినాతో భారత్‌లో కుండపోత వర్షాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోతున్న పేరు ఎల్ నినో. ఎల్ నినోతో రుతుపవనాలు బలహీనపడి భారత్ లాంటి దేశాల్లో లోటు వర్షపాతం నమోదైంది. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే, ఎల్ నినో ప్రభావం ఇంకా ముగిసిపోలేదని ఇప్పటికే ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది. రాబోయే నెలల్లో ఎల్ నినో ప్రభావం గరిష్ఠ స్థాయికి చేరుకోనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఎల్ నినో ప్రభావం కొనసాగుతుందని, ఆ తరువాత మాత్రం కరువు తీరిపోయేలా వర్షాలు పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రం అధిక ఉష్ణోగ్రతగల ఉపరితల జలాలు ఓవైపునకు చేరుకోవడాన్ని ఎల్ నినో అంటారు. ఇందుకు వ్యతిరేక దిశలో జలాలు కదిలితే దాన్ని లా నినా అంటారని నిపుణులు చెబుతారు. భూమధ్య రేఖ వెంబడి సముద్రంపై వీచే గాలులే జలాల కదలికలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. ఇక ఎల్ నినో కారణంగా బలహీనపడే రుతుపవనాలు లా నినా కారణంగా బలపడతాయి. ఫలితంగా భారత్‌లో వానాకాలంలో సాధారణ స్థాయికి మించి వర్షపాతం నమోదవుతుంది.

ఎల్ నినో, లా నినా రెండూ ఎన్‌సో సర్క్యులేషన్ అనే విస్తృత వాతావరణ ప్రక్రియలో భాగమని నిపుణులు చెబుతున్నారు. 3-7 ఏళ్ల వ్యవధిలో ఇవి ఒకటి తరువాత మరొకటిగా వస్తుంటాయి. అయితే, ప్రతిసారీ ఇలాగే జరుగుతుందని చెప్పలేమని కూడా శాస్త్రవేత్తలు అంటున్నారు. ఉదాహరణకు 2025 చివర్లో ఎల్ నినో బలహీనంగా మొదలై మరుసటి ఏడాది ప్రారంభంలోనే కనుమరుగైంది. ఆ తరవాత శక్తివంతమైన ఎల్ నినో ఏర్పడింది. ఇది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఈసారి బలమైన ఎల్ నినో ఏర్పడంతో వచ్చే ఏడాది లా నినా ఏర్పడే ఛాన్సుందని నిపుణులు భావిస్తున్నారు. అదే జరిగితే భారత్ వంటి దేశాలకు కరువు నుంచి విముక్తి లభించినట్టేనన్న అంచనాలు ఉన్నాయి. అయితే, ఇలాగే జరుగుతుందని కచ్చితంగా చెప్పలేని పరిస్థితుల్లో ఉన్న శాస్త్రవేత్తలు పసిఫిక్ మహాసముద్రంలోని మార్పులను జాగ్రత్తగా గమనిస్తున్నారు.

రూపాయి ఖర్చు లేకుండా.. ఫుల్ ఎంజాయ్‌మెంట్!

తిరువనంతపురం, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : వీకెండ్ వచ్చిందంటే చాలు.. చాలా మంది వివిధ ప్రదేశాలను సందర్శించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. మరికొందరు అయితే వాటర్ పార్కులు, స్విమ్మింగ్ పూల్స్ వంటి వాటికి వెళ్తుంటారు. ప్రతివారం వెళ్లాలంటే ఇవి ఖర్చుతో కూడుకున్నవే. వీటి ఎంట్రీ టికెట్ ఎక్కువగా ఉంటుంది. ఖర్చు లేకుండా నీటిలో జలకాలాడాలనుకునే వారికి ఓ ముఖ్య సమాచారం. ఎలాంటి ఎంట్రీ ఫీజులు లేకుండా ప్రకృతి ఒడిలో జలకాలాడే అవకాశం ఉంది. ప్రస్తుతం కేరళలోని సహజ సిద్ధమైన ఓ జల ప్రవాహం అందరినీ ఆకట్టుకుంటోంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

కేరళలోని మలప్పురం జిల్లా నిలంబూర్ సమీపంలోని టి.కె. కాలనీ (ుఖ జశీశ్రీశీఅఎ) వద్ద ఉన్న ఓ సహజ జల ప్రవాహం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఎలాంటి కృత్రిమ స్విమింగ్ పూల్స్ గానీ, ఖరీదైన ప్రవేశ రుసుములు గానీ ఉండవు. ఇదొక పూర్తిగా ప్రకృతి సిద్ధమైన వాటర్ పార్క్. ఇక్కడ ప్రవహించే కాలువలో పర్యాటకులు ఎలాంటి భయం లేకుండా ఈత కొడుతూ ఎంజాయ్ చేయవచ్చు. అంతేకాదు ఇక్కడ ఉన్న ఒక చెక్ డ్యామ్, సహజంగా ఏర్పడిన వాటర్ స్లైడ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రూపాయి ఖర్చు లేకుండా సహజ సిద్ధమైన నీటిలో ఈదులాటలు కొడుతూ, వాటర్ స్లైడ్‌పై జారుతూ పర్యాటకులు ఆనందిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. వాటర్ పార్కుల కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టే బదులు, తక్కువ ఖర్చుతో ప్రకృతిని ఆస్వాదించాలనుకునే ప్రకృతి ప్రేమికులకు ఈ ప్రాంతం ఒక చక్కటి అద్భుతమైన ప్రదేశమని చెప్పవచ్చు. కేరళ పర్యటనకు వెళ్లేవారు తమ టూర్లో ఈ ప్రాంతాన్ని కచ్చితంగా యాడ్ చేసుకోవాలని నెటిజన్లు సూచిస్తున్నారు.

కివీస్ ప్రతీకారం..

- టీమిండియాకు భారీ పరాభవం!
- నాలుగో టీట్వంటీలో 87 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- సెంచరీతో విరుచుకుపడిన గ్లెన్ ఫిలిప్స్ (107), బ్రాస్‌వెల్ (65) హాఫ్ సెంచరీ
- 259 పరుగుల భారీ స్కోరు సాధించిన కివీస్
- 172 పరుగులకే కుప్పకూలిన భారత బ్యాటింగ్ లైనప్
- కివీస్ పేసర్ జాకబ్ డఫ్ఫీకి నాలుగు వికెట్లు

ఆక్లాండ్, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయి డీలాపడిన న్యూజిలాండ్ ఎట్టకేలకు సత్తా చాటింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా శుక్రవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో కివీస్ జట్టు 87 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసి సిరీస్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. కివీస్ బ్యాటర్లలో గ్లెన్ ఫిలిప్స్ (49 బంతుల్లో 107; ఆరు ఫోర్లు, పది సిక్సర్లు) సుడిగాలి సెంచరీతో చెలరేగగా.. చివర్లో మైకెల్ బ్రాస్‌వెల్ (25 బంతుల్లో 65; నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం 260 పరుగుల అసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు.. కివీస్ బౌలర్ల ధాటికి ఇరవై ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 172 పరుగులకే పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అయితే, ఈ సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లు గెలిచిన భారత జట్టు ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

ఫిలిప్స్ సుడిగాలి సెంచరీ..

టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా.. కివీస్ బ్యాటర్లు ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. ఓపెనర్లు టిమ్ సైఫెర్ట్ (3) విఫలమైనా.. డారిల్ మిచెల్ (24), ఫిన్ అలెన్ (31) ధాటిగా ఆడారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. భారత బౌలర్లను ఊచకోత కోస్తూ మైదానం నలుమూలలా సిక్సర్లు, బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 49 బంతుల్లోనే పది భారీ సిక్సర్లు, ఆరు ఫోర్లతో 107 పరుగులు చేసి కెరీర్‌లో మూడో టీట్వంటీ సెంచరీ నమోదు చేశాడు. అతడికి తోడుగా మైకెల్ బ్రాస్‌వెల్ కూడా రెచ్చిపోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. బ్రాస్‌వెల్ కేవలం 25 బంతుల్లోనే ఆరు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 65 పరుగులు చేసి ఔటయ్యాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లు తీసినప్పటికీ 48 పరుగులు సమర్పించుకున్నాడు. నితీశ్ కుమార్ రెడ్డి (1/64), ప్రిన్స్ యాదవ్ (1/49), అర్ష్‌దీప్ సింగ్ (1/38), అక్షర్ పటేల్ (1/43) ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు.

తడబడిన టీమిండియా.. డఫ్ఫీ మ్యాజిక్..

260 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టుకు ఏమాత్రం శుభారంభం దక్కలేదు. కివీస్ పేసర్ జాకబ్ డఫ్ఫీ తొలి ఓవర్‌లోనే ఓపెనర్లు సంజు శాంసన్ (4), ఇషాన్ కిషన్ (0)లను పెవిలియన్‌కు పంపి కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ షాక్ నుంచి టీమిండియా చివరి వరకు కోలుకోలేకపోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (22), అభిషేక్ శర్మ (27), నితీశ్ కుమార్ రెడ్డి (21), నమన్ ధీర్ (28) కాసేపు క్రీజులో నిలబడినా.. భారీ షాట్లకు యత్నించి వికెట్లు పారేసుకున్నారు. మిడిలార్డర్‌లో తిలక్ వర్మ (35 బంతుల్లో 35; ఒక ఫోర్, మూడు సిక్సర్లు) కొంతసేపు ఒంటరి పోరాటం చేసినా అది జట్టును ఓటమి నుంచి రక్షించలేకపోయింది. అక్షర్ పటేల్ (7) నిరాశపరిచాడు. చివర్లో ప్రిన్స్ యాదవ్ (18 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. మొత్తంగా భారత బ్యాటర్లు ఎవరూ కనీసం హాఫ్ సెంచరీ కూడా సాధించలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫ్ఫీ కేవలం 23 పరుగులిచ్చి నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత పతనాన్ని శాసించాడు. మాథ్యూ ఫిషర్ 2, మిచెల్ సాంట్నర్ 2 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు.



చరిత్ర సృష్టించిన మనీషా

వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం

- ఫైనల్లో అమెరికా రెజ్లర్‌పై అద్భుత విజయం
- పసిడి గెలిచిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా సరికొత్త రికార్డు
- సుశీల్ కుమార్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో రెజ్లర్
- ఈ టోర్నీలో భారత్‌కు మొత్తం నాలుగు పతకాలు

ఆస్తానా, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : కజకిస్థాన్ రాజధాని ఆస్తానా వేదికగా జరుగుతున్న వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్ మనీషా భన్వాలా చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో బంగారు పతకం సాధించి అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకుంది. శుక్రవారం జరిగిన 59 కిలోల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో అమెరికాకు చెందిన అబిగైల్ నెట్టెను ఓడించి వరల్డ్ చాంపియన్‌గా అవతరించింది. దీంతో వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ చరిత్రలో స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా మనీషా సరికొత్త రికార్డు నెలకొల్పింది.

వెనుకబడినా.. అదరగొట్టింది..

ఫైనల్ పోరు ఆరంభంలో అమెరికా రెజ్లర్ అబిగైల్ దే పూర్తి ఆధిపత్యం కొనసాగింది. ఒకానొక దశలో మనీషా 0-6 పాయింట్ల తేడాతో తీవ్రంగా వెనుకబడింది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో మనీషా అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుసగా పాయింట్లు సాధిస్తూ కళ్లెం వేసింది. ఏకంగా ఎనిమిది పాయింట్లు స్కోరు చేసి చివరికి 8-6 తేడాతో సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. కళ్లు చెదిరే ప్రదర్శనతో విజయం సాధించడంతో భారత కుస్తీ అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.

రెండో భారత రెజ్లర్‌గా..

వరల్డ్ టైటిల్ గెలిచిన రెండో భారత రెజ్లర్‌గా మనీషా చరిత్రకెక్కింది. గతంలో 2010లో జరిగిన చాంపియన్‌షిప్‌లో దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్ 66 కేజీల ఫ్రీస్టైల్ కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు మనీషా ఆ ఫీట్ సాధించింది. ఇక, ఈ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మనీషా గెలిచిన పసిడితో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. కాజల్, నీలమ్ రజత పతకాలు సాధించగా.. తనూ శర్మ కాంస్యం గెలుపొందింది.

జపాన్ చిత్తు.. భారత్ హ్యాట్రిక్ విక్టరీ!

- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో జపాన్‌పై 4-1 తేడాతో ఘనవిజయం
- 150వ మ్యాచ్‌లో రెండు గోల్స్‌తో అదరగొట్టిన అభిషేక్ నైన్
- చివరి 15 నిమిషాల్లో మూడు గోల్స్‌తో చెలరేగిన టీమిండియా
- హర్మన్‌ప్రీత్, విష్ణుకాంత్ సింగ్ సూపర్ గోల్స్
- టోర్నీలో వరుసగా మూడో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానం

జలంధర్, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ-2026లో భారత పురుషుల హాకీ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. పంజాబ్‌లోని జలంధర్ వేదికగా శుక్రవారం జరిగిన ప్రాథమిక రౌండ్ మూడో మ్యాచ్‌లో భారత్ 4-1 గోల్స్ తేడాతో పటిష్టమైన జపాన్‌ను చిత్తు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో టోర్నీలో వరుసగా ముచ్చటగా మూడో గెలుపును సొంతం చేసుకున్న టీమిండియా పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు ఈ టోర్నీలో జపాన్‌కు ఇదే తొలి పరాజయం కావడం గమనార్హం.

చివరి క్షణాల్లో జపాన్ షాక్..

ఒలింపియన్ సుర్జిత్ సింగ్ హాకీ స్టేడియంలో జరిగిన ఈ పోరు ఆరంభం నుంచే ఉత్కంఠగా సాగింది. ఆట 11వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ అందించిన అద్భుతమైన పాస్‌ను అభిషేక్ నైన్ గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, మొదటి క్వార్టర్ ముగిసే చివరి క్షణాల్లో జపాన్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీనిని జపాన్ ఆటగాడు షోటా కగావా ఎంతో చాకచక్యంగా గోల్‌గా మలచడంతో స్కోరు 1-1తో సమం అయింది. ఆ తర్వాత రెండో, మూడో క్వార్టర్లలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడినా గోల్స్ నమోదు కాలేదు. జపాన్ డిఫెండర్లు అడ్డుగోడలా నిలబడి భారత దాడులను సమర్థవంతంగా అడ్డుకోవడంతో మ్యాచ్ ఎటువైపు మొగ్గుతుందోనన్న టెన్షన్ నెలకొంది.

చివరి 15 నిమిషాల్లో సునామీ..

చివరిదైన నాలుగో క్వార్టర్‌లో (ఆఖరి 15 నిమిషాల్లో) భారత ఆటగాళ్లు ఒక్కసారిగా చెలరేగిపోయారు. ఏకంగా మూడు గోల్స్ వర్షం కురిపించి జపాన్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తనకు లభించిన పెనాల్టీ కార్నర్‌ను పవర్‌ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా మలిచి భారత్‌కు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్‌కు ఇది ఐదో గోల్ కావడం విశేషం. ఆ వెంటనే తన 150వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న అభిషేక్ నైన్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 3-1కు పెంచాడు. ఇక, చివర్లో విష్ణుకాంత్ సింగ్ కూడా అద్భుతమైన సోలో గోల్‌తో మెరిసి భారత్ విజయాన్ని 4-1తో ఖాయం చేశాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న భారత జట్టు శనివారం జరగనున్న తన తదుపరి మ్యాచ్‌లో మలేషియాతో తలపడనుంది.

సెమీస్‌లో సింధు వర్సెస్ అన్మోల్!

క్వార్టర్స్‌లో డెన్మార్క్ క్రీడాకారిణిపై సింధు ఘనవిజయం

సార్‌బ్రూకెన్ (జర్మనీ), అక్టోబర్ 30 (సమయం న్యూస్) : జర్మనీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక హైలో ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. మహిళల, పురుషుల సింగిల్స్ విభాగాల్లో సత్తా చాటుతూ ముందంజ వేశారు. ముఖ్యంగా మహిళల సింగిల్స్ సెమీస్‌లో భారత క్రీడాకారిణులు ఇద్దరు ముఖాముఖి తలపడనుండటం విశేషం. స్టార్ షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, యువ సంచలనం అన్మోల్ ఖర్బ్ ఇద్దరూ సెమీస్‌కు దూసుకెళ్లి ఒకరికొకరు ఢీకొట్టేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో పీవీ సింధు 21-12, 21-10 తేడాతో డెన్మార్క్‌కు చెందిన అమాలీ షుల్జ్‌పై అలవోక విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి నుంచీ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిన సింధు.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. కేవలం 28 నిమిషాల్లోనే రెండు గేములను గెలుచుకుని సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. మరో క్వార్టర్ ఫైనల్‌లో భారత యువ క్రీడాకారిణులు అన్మోల్ ఖర్బ్, ఉన్నతి హుడా తలపడ్డారు. గంటా ఎనిమిది నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో అన్మోల్ ఖర్బ్ 21-17, 18-21, 21-16 తేడాతో ఉన్నతిపై విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. దీంతో ఫైనల్ బెర్త్ కోసం పీవీ సింధు, అన్మోల్ ఖర్బ్ సెమీస్‌లో తలపడనున్నారు. ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిచినా ఫైనల్‌లో భారత ప్రాతినిధ్యం ఖాయమైంది

లక్ష్యసేన్ అద్భుత కమ్‌బ్యాక్..

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ కూడా సెమీస్‌కు ముందంజ వేశాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో ఫిన్లాండ్ ఆటగాడు కల్లె కోల్జోనెన్‌పై 14-21, 21-17, 21-13 తేడాతో అద్భుత విజయం సాధించాడు. తొలి గేమ్‌ను కోల్పోయి మ్యాచ్‌లో వెనుకబడిన లక్ష్యసేన్.. ఆ తర్వాత అసాధారణంగా పుంజుకుని అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చాడు. ఆధిపత్యం ప్రదర్శిస్తూ మిగతా రెండు గేములను కైవసం చేసుకుని సెమీస్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్‌లో లక్ష్యసేన్ ఫ్రాన్స్‌కు చెందిన థోమా జూనియర్ పోపోవ్‌తో తలపడనున్నాడు.

ముంబై ఇండియన్స్ ఫీల్డింగ్ కోచ్‌గా తెలుగోడు!

టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌కు ఎంఐ బాధ్యతలు

ముంబై, అక్టోబర్ 30 (సమయం న్యూస్) : వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ సన్నాహాలు ముమ్మరం చేసింది. జట్టు కోచింగ్ స్టాఫ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసింది. ఇప్పటికే హెడ్ కోచ్‌గా మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌ను నియమించిన ముంబై.. శుక్రవారం కొత్త కోచింగ్ బృందాన్ని ప్రకటించింది. ఇందులో ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన తెలుగు వ్యక్తి టి.దిలీప్ ఎంపిక కావడం విశేషం.

టీమిండియా విజయాల్లో కీలక పాత్ర..

దిలీప్ దాదాపు ఐదేళ్ల పాటు భారత జాతీయ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించారు. భారత్ సాధించిన 2024, 2026 టీ20 వరల్డ్ కప్‌లతో పాటు, 2025 చాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో ఆయనది కీలక పాత్ర. భారత ఆటగాళ్ల ఫీల్డింగ్‌లో మెరుగవ్వడంలో దిలీప్ కృషి ఎంతో ఉంది. ఈ ట్రాక్ రికార్డును దృష్టిలో ఉంచుకునే ముంబై ఫ్రాంచైజీ ఆయనను తమ బృందంలోకి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

మాజీలకు పెద్దపీట..

బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పను ముంబై ఎంపిక చేసింది. బౌలింగ్ కోచ్‌లుగా న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనాఘన్, భారత మాజీ బౌలర్ ధవళ్ కులకర్ణిలను నియమించింది. వీరిలో దిలీప్ మినహా ఊతప్ప, మెక్‌క్లెనాఘన్, ధవళ్ కులకర్ణి గతంలో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన వారే కావడం గమనార్హం. కాగా, గత కొన్ని సీజన్లుగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ముంబై జట్టు తలరాతను.. ఈ కొత్త కోచింగ్ స్టాఫ్ ఎంతవరకు మారుస్తుందో చూడాలి.

లావణీ కళాకారిణిగా శ్రద్ధా కపూర్!

విఠాబాయి బయోపిక్ 'ఈశా' ట్రైలర్ విడుదల

ముంబై, అక్టోబర్ 30 (సమయం న్యూస్): బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఈశా' సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. విఠాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ కళాకారిణి ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లను ఇందులో కళ్లకు కట్టారు. ఈ పాత్ర శ్రద్ధా కెరీర్‌లోనే మైలురాయిగా నిలుస్తుందని అంచనా వేస్తున్నారు. 'ఛావా' చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎల్లమ్మ' కోసం 100 మంది కళాకారులు!

టైటిల్ సాంగ్ రికార్డింగ్ పూర్తి చేసిన డీఎస్పీ

విభిన్న సంస్కృతులకు చెందిన జానపద వాయిద్యకారులతో ప్రయోగం

హైదరాబాద్, అక్టోబర్ 30 (సమయం న్యూస్): 'బలగం' ఫేమ్ వేణు యెల్దండి దర్శకత్వంలో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ) హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'ఎల్లమ్మ'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన 100 మంది జానపద వాయిద్య కళాకారులతో కలిసి టైటిల్ సాంగ్ రికార్డింగ్ పూర్తి చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చేసిన ఈ ప్రయోగం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని తెలిపారు. త్వరలోనే సినిమా మొదటి సింగిల్‌ను విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ సినిమాలో దేవి శ్రీ ప్రసాద్ 'పర్షి' అనే పాత్రలో నటిస్తూ, తానే సొంతంగా సంగీతం సమకూర్చుకుంటున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. హన్షిత రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురానున్నారు. 'బలగం' తర్వాత వేణు నుంచి వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులు దీనిపై భారీ అంచనాలు పెట్టుకున్నారు.

కీర్తి సురేశ్‌కు చేదు అనుభవం!

హైదరాబాద్, అక్టోబర్ 30 (సమయం న్యూస్):
ప్రముఖ నటి కీర్తి సురేశ్‌కు విమాన ప్రయాణంలో ఓ చేదు అనుభవం ఎదురైంది. ఇటలీలోని మిలాన్ నుంచి భర్త ఆంటోనీ తట్టిల్‌తో కలిసి ఆమె భారత్‌కు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు సెల్ఫీ కోసం ఆమెను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. అతడు కనీసం నిలబడే స్థితిలో లేకపోవడంతో కాసేపు ఆగాలని కీర్తి కోరినా వినకుండా.. వెంటనే ఫొటో దిగాల్సిందేనంటూ పట్టుబట్టాడు. ఆ ప్రయాణికుడి ప్రవర్తన మితిమీరడంతో, సాధారణంగా ఎంతో ప్రశాంతంగా ఉండే తన భర్త ఆంటోనీ సైతం గట్టిగా వార్నింగ్ ఇవ్వాల్సి వచ్చిందని కీర్తి ఓ తాజా ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. చివరకు విమాన సిబ్బంది జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారని వివరించారు. అభిమానులతో మాట్లాడటం, వారి ప్రేమను స్వీకరించడం తనకు ఎంతో ఇష్టమేనని, అయితే అభిమానం పేరుతో వ్యక్తిగత హద్దులు దాటడం, స్వేచ్ఛకు భంగం కలిగించడం ఏమాత్రం సరికాదని కీర్తి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మోహన్‌లాల్ కొత్త సినిమా షురూ!

కొచ్చిలో పూజా కార్యక్రమాలు..

ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

కొచ్చి, అక్టోబర్ 30 (సమయం న్యూస్): మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ హీరోగా, దర్శకుడు అనూప్ సత్యన్ తెరకెక్కిస్తున్న కొత్త సినిమా కొచ్చిలో అట్టహాసంగా ప్రారంభమైంది. తాత్కాలికంగా చూ368 వర్కింగ్ టైటిల్‌తో పిలుస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాల్లో సినీ ప్రముఖులతో పాటు చిత్ర బృందం పాల్గొంది. నిర్మాత బిను జార్జ్ అలెగ్జాండర్ తల్లి జ్యోతి ప్రజ్వలన చేయగా.. తొలి షాట్‌కు మోహన్‌లాల్ స్వయంగా క్లాప్ కొట్టారు. 'వరణే అవశ్యముండ్' తర్వాత అనూప్ సత్యన్ దర్శకత్వం వహిస్తున్న రెండో సినిమా ఇది. పూర్తిస్థాయి యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో నటుడు ముకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి మోహన్‌లాల్ నవ్వుతూ కూర్చున్నట్లుగా పోస్టర్‌ను డిజైన్ చేశారు.

అనూప్ తండ్రి, ప్రముఖ దర్శకుడు సత్యన్ అంతికాడ్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోహన్‌లాల్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సత్యన్ మొదటి సినిమా నుంచి తాజా చిత్రం వరకు కలిసే పనిచేశామని, ఇప్పుడు ఆయన కొడుకుతో ప్రయాణం కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు. షెహనాద్ జలాల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. స్టంట్ శివ యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**